జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖ సంపుటి:1 ‖ సంచిక: 44 ‖ ఆదివారం ‖ 12-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-



12 జూలై 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:52 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి త్రయోదశి రా. 10:28 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం రోహిణి ఉ. 8:27 వరకు తరువాత ఆరుద్ర యోగం వృద్ధి రా. 8:01 వరకు కరణం గరజి మ. 12:17 వరకు వనిజ రా. 10:28 వరకు వర్జ్యం మ. 1:26 నుండి మ. 2:51 వరకు దుర్ముహూర్తం సా. 5:06 నుండి సా. 5:58 వరకు రాహుకాలం సా. 5:13 నుండి సా. 6:50 వరకు యమగండం మ. 12:21 నుండి మ. 1:59 వరకు గుళికాకాలం మ. 3:36 నుండి సా. 5:13 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:16 నుండి తె. 5:04 వరకు అమృత ఘడియలు తె. 5:36 నుండి ఉ. 7:02 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



ప్రముఖ గాయని
## ఎస్. జానకి కన్నుమూత
మైసూరులో చికిత్స పొందుతూ తుదిశ్వాస 2

## ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ హైదరాబాద్‌కు
# A 380 సర్వీసులపై ఆసక్తి

### మరిన్ని విమానాలు నడపాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి




**హైదరాబాద్, జూలై 11**

ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ సార్థన్ శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ సంస్థ భారతదేశంలో తన కార్యకలాపాలకు 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ భేటీ జరిగింది. సమావేశంలో తెలంగాణలో విమానయాన రంగ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌కు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రయాణికుల విమానాల్లో ఒకటైన ఎయిర్‌బస్–ఏ380 సర్వీసులను ప్రారంభించేందుకు ఎమిరేట్స్ ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే హైదరాబాద్ అంతర్జాతీయ విమాన అనుసంధానం మరింత బలోపేతం (మిగతా 2వ పేజీలో)




రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో
# భూ పునఃసర్వే

### భూ భారతి చట్టం సమర్థ అమలుకు ప్రాధాన్యం: మంత్రి పొంగులేటి

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావడంతో పాటు రైతుల భూ హక్కులకు సంపూర్ణ భద్రత కల్పించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా భూ పునఃసర్వేను ప్రాధాన్య ప్రాతిపదికన చేపట్టాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ, గృహ నిర్మాణం తదితర శాఖల పనితీరును సమీక్షించిన మంత్రి, భూ పునఃసర్వేను మూడు దశల్లో చేపడతామని తెలిపారు. మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. పనుల పురోగతిని ప్రతి నెల సమీక్షిస్తామని వెల్లడించారు.



**ఖమ్మం/హైదరాబాద్, జూలై 11**

ఇప్పటికే ఐదు గ్రామాల్లో చేపట్టిన పైలట్ సర్వే ద్వారా 95 శాతం భూ వివాదాలు పరిష్కారమయ్యాయని, దీంతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. లైసెన్స్ పొందిన సర్వేయర్లకు ఎకరాకు రూ.60 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. విధుల్లో నిర్దేశిత సమయంలో చేరని సర్వేయర్ల లైసెన్సులను రద్దు చేసే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 'సాదాబైనామా' దరఖాస్తుల తిరస్కరణపై విచారణ నిర్వహించాలని, తిరస్కరణకు గల కారణాలను గుర్తించి అవసరమైతే నోటీసులు జారీ చేసి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజాదర్బార్‌లలో వచ్చిన రెవెన్యూ ఫిర్యాదుల్లో 98 శాతం (మిగతా 2వ పేజీలో)



సంగారెడ్డి నుంచి పోటీ చేయను..
నా రాజకీయ భవిష్యత్తుపై పార్టీదే
## తుది నిర్ణయం
కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి

**హైదరాబాద్, జూలై 11**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయబోనని, అయితే ఇతర నియోజకవర్గం నుంచి పోటీ చేయాలా వద్దా అన్నది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించిన 117 అసెంబ్లీ స్థానాల గెలుపు లక్ష్యాన్ని స్వాగతించారు. ముందస్తుగానే పార్టీని ఎన్నికలకు సిద్ధం చేయడం మంచి రాజకీయ వ్యూహమని పేర్కొన్నారు. తరువాయి 2 వ పేజీలో...



పోక్సో కేసులో బెయిల్‌పై వచ్చిన వ్యక్తి దారుణం
# షాబాద్‌లో ఆరుగురి హత్య
### బాలిక సహా కుటుంబ సభ్యులపై కత్తితో దాడి

**హైదరాబాద్, జూలై 11**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. పోక్సో (POCSO) కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తి 17 ఏళ్ల బాలికతో పాటు మొత్తం ఆరుగురిని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, షాబాద్ మండలం దైవలగూడ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్పై ఈ ఏడాది మే నెలలో 17 ఏళ్ల బాలిక వేధింపులకు గురిచేశాడంటూ ఫిర్యాదు చేసింది. దీంతో మే 16న అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం అతడు బెయిల్‌పై విడుదలయ్యాడు. దర్యాప్తు ప్రకారం, శనివారం తెల్లవారుజామున నిందితుడు బాలిక ఇంట్లోకి ప్రవేశించి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను సమీపంలోని వ్యవసాయ పొలానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అదే ఘటనలో బాలిక తల్లి చిట్యాల లక్ష్మి (45), అమ్మమ్మ చిట్యాల రుక్కమ్మ (65)లను కూడా హత్య చేసినట్లు గుర్తించారు. ఇక మరో ఘటనలో నిందితుడు తన స్వగృహానికి వెళ్లి భార్య పార్వతి సారిత (30)తో పాటు తన ఇద్దరు (మిగతా 2వ పేజీలో)





# శుద్ధ్ ప్రాజెక్టుకు శ్రీకారం
### భూగర్భ మురుగు నిర్వహణకు సాంకేతికత

భూగర్భ మురుగు కాలువల నిర్వహణలో అత్యాధునిక సాంకేతికతను వినియోగించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. హైదరాబాద్‌లోని టీ-వర్క్స్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 'శుద్ధ్' ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా యంత్ర మానవాలు, కృత్రిమ మేధ, మేధో వ్యవస్థలను మురుగు కాలువల నిర్వహణలో వినియోగించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల ప్రాణ భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. - **హైదరాబాద్, జూలై 11**

భూగర్భ మురుగు వ్యవస్థల పర్యవేక్షణ, లోపాల గుర్తింపు, మరమ్మతులు వంటి పనులను యంత్ర మానవాలు, కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలతో మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల పట్టణ పారిశుద్ధ్య సేవల నాణ్యత మెరుగుపడటంతో పాటు ప్రమాదాలు (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం: ఈరోజు ఆర్థిక విషయాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. ఉద్యోగంలో మీ కృషికి ప్రశంసలు అందుకుంటారు. కొత్త పనులు ప్రారంభించడానికి అనుకూలమైన సమయం. ఆరోగ్యంపై స్వల్ప శ్రద్ధ అవసరం. దైవారాధన మనశ్శాంతిని కలిగిస్తుంది.

వృషభం: ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రారంభించిన పనులను విజయవంతంగా పూర్తి చేస్తారు. బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. ఆర్థికంగా అనుకూల ఫలితాలు ఉంటాయి. కుటుంబంలో ఆనందకరమైన వాతావరణం నెలకొంటుంది. తొందరపాటు నిర్ణయాలను మాత్రం నివారించండి.

మిథునం: అనవసర ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యమైన విషయాల్లో ఓర్పుతో వ్యవహరించడం మంచిది. ఉద్యోగంలో బాధ్యతలు అధికమవుతాయి. ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. పెద్దల సలహా మీకు మేలు చేస్తుంది.

కర్కాటకం: మిత్రుల సహాయంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. ఆదాయంలో పెరుగుదల కనిపిస్తుంది. కొత్త పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. బంధువుల నుండి శుభవార్త వినే అవకాశం ఉంది. పెట్టుబడుల్లో జాగ్రత్త అవసరం.

సింహం: ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మంచి పురోగతి ఉంటుంది. అధికారుల ఆదరణ లభిస్తుంది. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తారు. ఆర్థికంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి. అహంకారాన్ని దూరంగా ఉంచడం మంచిది.

కన్య: దూర ప్రయాణాలకు అనుకూల సమయం. శుభకార్యాలపై ఆసక్తి పెరుగుతుంది. గురువుల ఆశీస్సులు లభిస్తాయి. విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దైవదర్శనం శుభప్రదంగా ఉంటుంది.

తుల: కొన్ని పనుల్లో ఆలస్యం జరిగినా చివరకు అనుకూల ఫలితం పొందుతారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. అప్పులు లేదా ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తగా ఉండండి. కుటుంబ సభ్యుల సహకారం ఉంటుంది. ఆవేశపూరిత నిర్ణయాలను నివారించండి. శివారాధన శ్రేయస్కరం.

వృశ్చికం: భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన పెరుగుతుంది. భాగస్వామ్య వ్యాపారాలకు అనుకూల సమయం. కొత్త ఒప్పందాలు లాభదాయకంగా ఉంటాయి. ఉద్యోగంలో అభివృద్ధి అవకాశాలు కనిపిస్తాయి. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. శుభవార్తలు అందుతాయి.

ధనస్సు: శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. శత్రువులపై విజయం సాధిస్తారు. ఉద్యోగంలో మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆరోగ్యంపై చిన్నచిన్న సమస్యలు రావచ్చు. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది. ఖర్చులను నియంత్రించడం మంచిది.

మకరం: సంతాన సంబంధిత శుభవార్తలు వినే అవకాశం ఉంది. విద్య, కళారంగాల్లో ఉన్నవారికి మంచి ఫలితాలు వస్తాయి. కొత్త ఆలోచనలు విజయవంతమవుతాయి. ఆర్థికంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి. కుటుంబంలో సంతోషం నెలకొంటుంది. ఇష్టదైవ ప్రార్థన మేలు చేస్తుంది.

కుంభం: ఇంటి విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. స్థిరాస్తి సంబంధిత పనులు ముందుకు సాగుతాయి. కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. ఉద్యోగంలో ఒత్తిడి తగ్గుతుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. ఓర్పుతో వ్యవహరిస్తే అన్ని పనులు సజావుగా పూర్తవుతాయి.

మీనం: ధైర్యం, ఆత్మవిశ్వాసంతో పనులు పూర్తి చేస్తారు. సోదరులతో అనుబంధం బలపడుతుంది. చిన్న ప్రయాణాలు లాభిస్తాయి. వ్యాపారంలో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఆర్థికంగా సంతృప్తికరమైన పరిస్థితులు ఉంటాయి.



### వికసిత్ భారత్ లక్ష్య సాధనలో

# మహిళలు, యువత కీలకం

## యువత ఉద్యోగాలు కోరేవారిగా కాకుండా ఉద్యోగాలు కల్పించేవారిగా ఎదగాలి: గవర్నర్

హైదరాబాద్, జూలై 11

వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన భారత్) లక్ష్య సాధనలో మహిళా సాధికారతతో పాటు యువత చురుకైన భాగస్వామ్యం అత్యంత కీలకమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. శనివారం లోక్‌భవన్‌లో వికసిత్ వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్ (VVVP), వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ (VBYP) విజేతలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ (MY Bharat) తెలంగాణ రాష్ట్ర కార్యాలయం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళల రాజకీయ సాధికారతలో భాగంగా తీసుకొచ్చిన



106వ రాజ్యాంగ సవరణ చట్టం (నారీ శక్తి వందన్ అధినియమ్) పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు మూడో వంతు సీట్ల రిజర్వేషన్ కల్పించే చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత శాసనసభలు, పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుం దనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ద్వారా కోట్లాది మంది, ముఖ్యంగా మహిళలు తొలిసారిగా అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థలో చేరారని గవర్నర్ తెలిపారు. మహిళలను స్వయం సహాయక సంఘాలతో అనుసంధానం చేసి, సంక్షేమ పథకాల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా ఆర్థిక స్వావలంబన, పారదర్శకత, ఆర్థిక చేర్పు పెరిగిందన్నారు. యువత, మహిళలు సూక్ష్మ, చిన్న పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు వెతికే వారిగా కాకుండా, ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు తమ ప్రాంతాల ఆధారంగా కాకుండా భారతీయులుగానే గుర్తింపు పొందుతున్నారని, దేశభక్తి, భారతీయ సంస్కృతి, జాతీయ సమైక్యత విలువలను యువత, విదేశాల్లో నివసించే భారతీయులు కూడా పరిరక్షించాలని గవర్నర్ కోరారు.

# హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌కు నూతన హంగులు

**ప్రయాణికుల సౌకర్యాల విస్తరణతో ఆధునికీకరణ పూర్తి**

హైదరాబాద్, జూలై 11

కేంద్ర ప్రభుత్వ అమృత్ స్టేషన్ పథకం కింద హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించి ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా స్టేషన్‌కు కొత్త భవనం, ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం (పోర్టికో), 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, అదనపు లిఫ్టులు, ఎస్కలేటర్లు, విశాలమైన వేచిచూసే హాలు, ఆధునిక మరుగుదొడ్లు, మెరుగైన ప్లాట్‌ఫారాలు, మెరుగైన విద్యుత్ వెలుతురు, సుందరీకరణ పనులు, దివ్యాంగులకు అనుకూల సౌకర్యాలు, ప్రయాణికులకు మార్గదర్శక సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. రోజుకు సుమారు 3,000 మంది ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తుండగా, హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు ఇది కీలక రైల్వే కేంద్రంగా కొనసాగుతోంది. ఇక్కడి నుంచి ప్రతిరోజూ సుమారు 62 సబర్బన్ రైలు సర్వీసులు సికింద్రాబాద్, హైదరాబాద్, ఉమ్దానగర్, ఫలక్‌నుమా, మెడ్చల్, ఘట్‌కేసర్ ప్రాంతాలకు నడుస్తున్నాయి.

# ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూత

మైసూరు: ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన జానకి అన్ని భాషల్లో కలిపి దాదాపు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను ఆలపించారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, వివిధ సినీ అవార్డులు వరించాయి. తెలుగు ప్రేక్షకులు ఎప్పటికీ మరిచిపోలేని పాటలను ఎస్.జానకి ఆలపించారు. తొలిసారి మిమ్మల్ని (శ్రీవారికి ప్రేమలేఖ), మంచు కురిసే వేళలో (అభినందన), అరె ఏమైందీ (ఆరాధన), బంతి చామంతి (అభిలాష), సిరిమల్లె పువ్వా (పదహారేళ్ల వయసు), మౌనమేలనోయి (సాగర సంగమం), ప్రియతమా నా హృదయమా (ప్రేమ), అందాలలో (జగదేకవీరుడు అతిలోకసుందరి), ఈ దుర్యోధన దుశ్శాసన (ప్రతిఘటన), మాటే మంత్రము (సీతాకోకచిలుక), సుందరి నీవే (దళపతి– తెలుగు వెర్షన్) వంటి సూపర్‌హిట్ సాంగ్స్ పాడారు.

# ..ఐటీ విప్లవం 'ఏఐ యాజ్ ఏ సర్వీస్'తోనే

(మొదటి పేజీ తరువాయి)

"వికసిత్ భారత్–2047 నిర్మాణంలో సాంకేతికత పాత్ర" సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం పరిశ్రమల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు. భారత్‌పై ప్రపంచానికి ఉన్న విశ్వాసం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన డిజిటల్ మౌలిక వసతులు దేశాన్ని ఏఐ విప్లవంలో అగ్రగామిగా నిలబెట్టే శక్తిని కల్పిస్తున్నాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఆధునిక మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు మరింత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం భాగస్వామ్యంతో నాస్కామ్ విద్యాసంస్థల కోసం ఏఐ పాఠ్యాంశాలను రూపొందించిందని తెలిపారు. సెమీకండక్టర్ రంగంలో దేశవ్యాప్తంగా 12 తయారీ యూనిట్లు అభివృద్ధి దశలో ఉన్నాయని, వాటిలో మూడు ఇప్పటికే చిప్‌ల ఉత్పత్తి ప్రారంభించాయని వెల్లడించారు. అలాగే 315 విశ్వవిద్యాలయాలకు అత్యాధునిక సెమీకండక్టర్ డిజైన్ టూల్స్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రస్తుతం మొబైల్ ఫోన్లు భారతదేశం నుంచి అత్యధికంగా ఎగుమతి అవుతున్న ఉత్పత్తులుగా నిలిచాయని తెలిపారు. ఈ రంగం విలువ రూ.13 లక్షల కోట్ల నుంచి రూ.20 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా వేశారు. తెలంగాణలో 104 ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలకు కేంద్రం మద్దతు అందించడంతో పాటు, నాలుగు ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లను మంజూరు చేసి, ఒక కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరులను అనుసంధానించే మూడు బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ఆయన, హైదరాబాద్‌ను హైస్పీడ్ రైలు, కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, కవచ్ సాంకేతికత, విజువల్ ఎఫెక్ట్స్ (ఎఖీశ), డిజిటల్ ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. తెలంగాణలో రైల్వేలకు వార్షిక పెట్టుబడులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రూ.880 కోట్ల నుంచి ప్రస్తుతం రూ.5,400 కోట్లకు పైగా పెరిగాయని, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రంలోని సుమారు 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా వరంగల్, కరీంనగర్ వంటి రెండో శ్రేణి నగరాలకు కూడా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు విస్తరించాలని సూచించారు. సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఇద్దరు కేంద్ర మంత్రులు సంగారెడ్డి జిల్లా కొండకల్‌లోని మేధా బోగీస్ ఫ్యాక్టరీ, ఫ్యాబ్ సిటీ రోడ్డులోని మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలను సందర్శించారు. అక్కడ తయారీ ప్రక్రియలు, సాంకేతిక సామర్థ్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

# శుద్ధ్ ప్రాజెక్టుకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

కూడా తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజల దైనందిన జీవితాల్లో ఎదురవుతున్న సమస్యలకు సాంకేతికత ద్వారా పరిష్కారాలు చూపించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్ బాబు తెలిపారు. ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇవ్వడంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. టీ–వర్క్స్ వేదికగా రూపుదిద్దుకుంటున్న ఇటువంటి వినూత్న ప్రాజెక్టులు పరిశోధన, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడతాయని మంత్రి అన్నారు. ప్రభుత్వ శాఖలు, సాంకేతిక సంస్థలు, నూతన ఆవిష్కర్తల మధ్య సమన్వయంతో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. 'శుద్ధ్' ప్రాజెక్టు ద్వారా భూగర్భ మురుగు నిర్వహణను మరింత సురక్షితంగా, వేగవంతంగా,



సమర్థవంతంగా మార్చడంతో పాటు పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలను కాపాడే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసిందని మంత్రి పేర్కొన్నారు.

## A380 సర్వీసులపై ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

అవుతుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు వచ్చే, ఇక్కడి నుంచి వెళ్లే ఎమిరేట్స్ విమానాల సంఖ్యను పెంచాలని కోరారు. అలాగే తెలంగాణలో ప్రతిపాదిత రెండు కొత్త విమానాశ్రయాల్లో మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (వీ=వా) కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. విమానయాన రంగ విస్తరణకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, ప్రభుత్వ సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

## భూ పునఃసర్వే

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలకు భూ పునఃసర్వే శాశ్వత పరిష్కారం చూపగలదని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అవసరాల కోసం భూమిలో కొంత భాగాన్ని మాత్రమే స్వాధీనం చేసుకున్నప్పటికీ, మొత్తం భూమిని 22–ఏ నిషేధిత జాబితాలో చేర్చిన కేసులను వెంటనే సరిచేసి రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు త్వరగా అప్పగించాలని సూచించారు. రెండో విడత గృహ నిర్మాణంలో గుడిసెల్లో నివసించే కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్మాణ సామగ్రి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

## షాబాద్‌లో ఆరుగురి హత్య

(మొదటి పేజీ తరువాయి)

కుమారులు పరిక్షిత్ (3), దైవిక్షిత్ (2)లను కూడా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. తన కుటుంబ సభ్యులను ఎందుకు హత్య చేశాడన్న అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. హత్యలు చేసిన అనంతరం నిందితుడు తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి, రెండు వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం ఆరుగురిని హత్య చేశానని, తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానని చెప్పినట్లు సమాచారం. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. అయితే పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకునేలోపే నిందితుడు పరారయ్యాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషితో పాటు ఇతర ఉన్నతాధికారులు సంఘటనా స్థలాలను సందర్శించి దర్యాప్తును పర్యవేక్షించారు. ఘటనకు గల పూర్తి కారణాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

శ్వేత

సంపాదకీయం

ఆదివారం 12-7-2026

# గందరగోళంగా సర్ ప్రక్రియ!

సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు. 'సర్' పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళుతుంటారు.

వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం ఖాయం.

ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్ లో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.



## ఉద్యోగ సంఘాలతో మంత్రుల చర్చలు సఫలం

**శ్రీకాకుళం ఉద్యమ సభ తాత్కాలిక వాయిదా**

**23 డిమాండ్లపై ప్రభుత్వంతో సానుకూల చర్చలు**

**జూలై 21న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం**

**పీఆర్సీ, డీఏలు, ఏరియర్స్‌పై మరోసారి చర్చలు**

అమరావతి, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సచివాలయంలో అమరావతి జేఏసీ ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి విస్తృతంగా చర్చలు జరిపారు. ఉద్యోగ సంఘాల నేతలు 23 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రులకు అందజేయగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. చర్చల్లో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, డీఏలు, ఏరియర్స్‌తో పాటు ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై చర్చించారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని, అయినప్పటికీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకుంటున్న చర్యలను ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు వివరించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఇతర సమావేశాల కారణంగా హాజరు కాలేకపోవడంతో, ఈ నెల 21న లేదా అంతకంటే ముందే మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. జూలై 21న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, అన్ని ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను సేకరించి ముఖ్యమంత్రికి సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు మంత్రులు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి పీఆర్సీ, డీఏలు, ఏరియర్స్ చెల్లింపులపై కార్యాచరణ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సానుకూలంగా ముగియడంతో అమరావతి జేఏసీ నేతలు తాత్కాలికంగా ఉద్యమ కార్యాచరణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రేపు శ్రీకాకుళంలో నిర్వహించాలని నిర్ణయించిన ఉద్యమ సన్నాహక సభను కూడా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. భవనాలపై పన్నుల విధింపు, ఆర్టీసీ ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వంటి అంశాలపై కూడా ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి సూచనలు చేయగా, వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రులు భరోసా ఇచ్చారు

## ఐఎస్ఎస్‌కు భారత సంతతి వ్యోమగామి అనిల్ మేన్

**14న రోదసిలోకి పయనం**



గ్లోబల్ డెస్క్, జూలై 11: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి అనిల్ మేనన్ ఈ నెల 14న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనమవనున్నారు. కజకిస్థాన్‌లోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుండి రష్యా వ్యోమనౌక 'సోయుజ్-ఎమ్ఎస్-29' ద్వారా ఈ యాత్ర ప్రారంభం కానుంది. మేనన్‌తో పాటు రష్యా వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినాలు కూడా ఈ రోదసి యాత్రలో పాల్గొంటున్నారు. అమెరికాలోని మినియాపోలిస్‌లో జన్మించిన అనిల్ మేనన్.. అత్యవసర వైద్య నిపుణుడిగా, మెకానికల్ ఇంజినీర్‌గా గుర్తింపు పొందారు. ఆయన తండ్రి భారతదేశం నుండి అమెరికాకు వలస వెళ్లగా, తల్లి ఉక్రెయిన్ మూలాలు కలిగిన వ్యక్తి. గతంలో అమెరికా వైమానిక దళంలో పనిచేసిన మేనన్, అఫ్గానిస్థాన్ యుద్ధంలోనూ పాలుపంచుకున్నారు. నాసాలో ఫ్లైట్ సర్జన్‌గా, స్పేస్ ఎక్స్ వైద్య విభాగంలో సేవలందించిన ఆయన, 2021 డిసెంబరులో నాసా వ్యోమగామిగా ఎంపికయ్యారు. విశేషమేమిటంటే, ఆయన భార్య అన్నా విల్హామ్ కూడా వ్యోమగామి కాగా, ఆమె 2024 సెప్టెంబరులోనే అంతరిక్షయానం పూర్తి చేసుకున్నారు. ఈ యాత్రలో భాగంగా అనిల్ మేనన్ సుమారు 8 నెలల పాటు అంతరిక్షంలోనే గడపనున్నారు. సుదీర్ఘకాలం రోదసిలో ఉండటం వల్ల మానవ శరీరంపై, ముఖ్యంగా సూక్ష్మ గురుత్వాకర్షణ కారణంగా రక్తప్రవాహంపై పడే ప్రభావాలపై ఆయన ప్రయోగాలు నిర్వహించనున్నారు. ఐఎస్ఎస్‌లోని తాగునీటి వ్యవస్థను ఉపయోగించి, రక్తనాళాల్లోకి ఎక్కించే ద్రవాలను తయారుచేసే పరిజ్ఞానాన్ని కూడా ఆయన పరిశీలిస్తారు. వీటితో పాటు సెమీ కండక్టర్ క్రిస్టల్స్ ఉత్పత్తి విధానాలను మెరుగుపరిచే పరిశోధనలు చేయనున్నారు. ఈ ప్రయోగాలు భవిష్యత్తులో శక్తిమంతమైన కంప్యూటర్లు, కృత్రిమ మేధ (ఏఐ) మరియు మెరుగైన వైద్య సాధనాల రూపకల్పనకు ఎంతగానో మార్గం సుగమం చేస్తాయి. రోదసి యాత్రకు ముందు మేనన్ గతంలో హిమాలయన్ రెస్క్యూ అసోసియేషన్‌లోను, భారత్‌లో పోలియో టీకా కార్యక్రమంపై అధ్యయనంలోనూ చురుగ్గా పాల్గొనడం గమనార్హం.


## యూకేలో చదవాలంటే ఎందుకు ఇప్పుడే అప్లై చేయాలి? ఇవే ప్రధాన కారణాలు

ప్రత్యేక కథనం

ప్రపంచ స్థాయి విద్య, అంతర్జాతీయ గుర్తింపు పొందిన డిగ్రీలు, అత్యుత్తమ కెరీర్ అవకాశాలతో యునైటెడ్ కింగ్‌డమ్ (ఖఖ) భారతీయ విద్యార్థులకు ప్రముఖ గమ్యస్థానంగా కొనసాగుతోంది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు యూకేలో ఉన్నత విద్య కోసం అడుగులు వేస్తున్నారు. అయితే మంచి యూనివర్సిటీల్లో సీటు పొందాలంటే ముందుగానే అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించడం ఎంతో అవసరమని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

**మంచి యూనివర్సిటీల్లో సీట్లు త్వరగా నిండిపోతాయి**

యూకేలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు పరిమితంగా ఉంటాయి. దరఖాస్తులు ఎక్కువగా రావడం వల్ల సీట్లు ముందుగానే భర్తీ అవుతాయి. అందుకే విద్యార్థులు ఆలస్యం చేయకుండా అప్లై చేయడం మంచిది.

**స్కాలర్‌షిప్ అవకాశాలను పొందే అవకాశం ఎక్కువ**

ముందుగానే దరఖాస్తు చేసిన విద్యార్థులకు అనేక విశ్వవిద్యాలయాలు మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌లను అందిస్తాయి. దీని ద్వారా ట్యూషన్ ఫీజులో గణనీయమైన తగ్గింపు పొందే అవకాశం ఉంటుంది.

**వీసా ప్రక్రియకు తగిన సమయం లభిస్తుంది**

యూనివర్సిటీ అడ్మిషన్ తర్వాత జూూ, ఫైనాన్షియల్ డాక్యుమెంట్స్, స్టూడెంట్ వీసా వంటి ప్రక్రియలు పూర్తి చేయడానికి సమయం అవసరం. ముందుగా అడ్మిషన్ తీసుకోవడం వల్ల ఈ ప్రక్రియలు ఒత్తిడి లేకుండా పూర్తి చేసుకోవచ్చు.

**వసతి ఎంపికలో ఎక్కువ అవకాశాలు**

ముందుగా అడ్మిషన్ పొందిన విద్యార్థులు యూనివర్సిటీ హాస్టల్ లేదా తమకు అనుకూలమైన ప్రైవేట్ వసతిని సులభంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది.

**విద్యా రుణం పొందడం సులభం**

అడ్మిషన్ లెటర్ వచ్చిన వెంటనే విద్యార్థులు ఎడ్యుకేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతో ఫీజులు, ఇతర ఖర్చులకు సంబంధించిన ఆర్థిక ప్రణాళికను సులభంగా రూపొందించుకోవచ్చు.

**సరైన మార్గదర్శకత్వం విజయానికి మొదటి అడుగు**

విదేశీ విద్యకు సంబంధించిన కోర్సు ఎంపిక, యూనివర్సిటీ ఎంపిక, స్కాలర్‌షిప్‌లు, అడ్మిషన్, వీసా వంటి అంశాల్లో నిపుణుల సలహాలు తీసుకోవడం ద్వారా విద్యార్థులు సరైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది.

యూకేలో చదవడం అనేది కేవలం ఒక డిగ్రీ పొందడం మాత్రమే కాదు. ప్రపంచ స్థాయి విద్యతో పాటు అంతర్జాతీయ కెరీర్‌కు బలమైన పునాది వేయడానికి ఇది ఒక గొప్ప అవకాశం. యూకేలో బ్యాచిలర్స్ లేదా మాస్టర్స్ చదవాలని భావిస్తున్న విద్యార్థులకు యూనివర్సిటీ ఎంపిక, కోర్సు ఎంపిక, స్కాలర్‌షిప్‌లు, అడ్మిషన్ ప్రాసెస్, డాక్యుమెంటేషన్ మరియు స్టూడెంట్ వీసా మార్గదర్శకత్వంలో **EXXEELLA Educational Group** సమగ్ర సేవలను అందిస్తోంది.

**మరిన్ని వివరాలకు**

EXXEELLA
Educational Group
Study in UK
Admissions
Scholarships
Student Visa
Guidance



...సంప్రదించండి....

EXXEELLA Educational Group
**Bhanu Sairam Arepu**
Educational Counsellor
9100749422
applications@exxeella.com

# 25వ స్నాతకోత్సవం నిర్వహించిన ఐఐటీ హైదరాబాద్

**526 మంది విద్యార్థులకు పట్టాలు**

హైదరాబాద్, జులై 11

దేశంలోని ప్రముఖ పరిశోధనా విద్యాసంస్థలలో ఒకటైన ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐఐటీ హైదరాబాద్) శనివారం తన 25వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా మొత్తం 526 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసింది. ఈ ఏడాది పట్టాలు పొందిన వారిలో 166 మంది అండర్ గ్రాడ్యుయేట్, 303 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 57 మంది ఎంఎస్ఐటీ (మీ×ు) విద్యార్థులు ఉన్నారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మద్దిరెడ్డి కృతిన్ (బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్)కు గోల్డ్ మెడల్ ప్రదానం చేయగా, విద్య, సహపాఠ్య కార్యక్రమాలు, సంస్థ సేవల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన అభినవ్ దిగంబర్ రౌంధాల్కు ఉత్తమ ఆల్‌రౌండర్ అవార్డు అందజేశారు. భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు అజయ్ కుమార్ సూద్ వర్చువల్ విధానంలో స్నాతకోత్సవ ప్రసంగం చేస్తూ, సాంకేతిక ఆవిష్కరణలు సమాజంలోని ప్రతి వర్గానికీ ప్రయోజనం చేకూరేలా బాధ్యతాయుత దృక్పథంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఐఐఐటీ హైదరాబాద్ పాలక మండలి ఛైర్మన్ అశోక్ ఝూంజహున్వాలా మాట్లాడుతూ, ఈ ఏడాది పట్టభద్రుల్లో దాదాపు మూడోవంతు మంది మహిళలు ఉండడం సంతోషకరమని పేర్కొన్నారు. వాస్తవ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించే పరిశోధనా కేంద్రంగా ఐఐఐటీ హైదరాబాద్ ఎదుగుతోందన్నారు. సంస్థ డైరెక్టర్ సందీప్ శుక్ల మాట్లాడుతూ, సాంకేతిక నైపుణ్యంతో పాటు సామాజిక సమస్యలకు పరిష్కారాలను అన్వేషించే భావజాలాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం సంస్థ లక్ష్యమన్నారు. ఈ ఏడాది పట్టభద్రుల్లో 31 శాతానికి పైగా మంది పరిశోధన ఆధారిత థీసిస్‌లతో డిగ్రీలు పూర్తి చేయడం సంస్థ పరిశోధనకు ఇచ్చే ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. 2002లో జరిగిన తొలి స్నాతకోత్సవంలో కేవలం 49 మంది విద్యార్థులకు పట్టాలు అందించిన ఐఐఐటీ హైదరాబాద్ ప్రస్తుతం 2,524 మంది విద్యార్థులు, 114 మంది అధ్యాపకులు, 8,200 మందికి పైగా పూర్వ విద్యార్థులతో దేశంలో ప్రముఖ పరిశోధనా విశ్వవిద్యాలయంగా ఎదిగిందని సంస్థ వెల్లడించింది. గత ఏడాది సంస్థ 371 పరిశోధనా పత్రాలు, మేధోసంపత్తి ఫలితాలు, 22 పేటెంట్లు, 55కు పైగా ప్రాయోజిత పరిశోధన ప్రాజెక్టులు సాధించింది. అదేవిధంగా అడోబ్ , గూగుల్ , క్వాల్కమ్మ , అమెజాన్ వంటి ప్రముఖ సాంకేతిక సంస్థల నుంచి 10 మంది అధ్యాపకులు పరిశోధన గ్రాంట్లు పొందారు. ఉద్యోగ అవకాశాల పరంగా 119 సంస్థలు క్యాంపస్ నియామకాల్లో పాల్గొనగా, 59 సంస్థలు విద్యార్థులకు ఉద్యోగ ఆఫర్లు ఇచ్చాయి. అలాగే గత ఎనిమిదేళ్లలో కృత్రిమ మేధస్సు (ూ×), మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చెయిన్, డేటా సైన్స్, జనరేటివ్ ూ× వంటి రంగాల్లో 4,500 మందికి పైగా నిపుణులకు ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ద్వారా శిక్షణ అందించింది. అలాగే సంస్థ పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్వహిస్తున్న అలుమ్నీ ఫండ్ ద్వారా 75 మందికి పైగా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించగా,ూుడు, జ+× వంటి కార్పొరేట్ సంస్థలు కూడా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల రూపంలో మద్దతు కొనసాగిస్తున్నాయి.ం

# సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జులై 11

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విప్లవాత్మక సామాజిక సంక్షేమ కార్యక్రమాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదాడలో రూ.21 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ డిపోకు, హుజూర్‌నగర్ బస్ స్టేషన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సాగునీరు, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలుగా రెడ్‌లకుంట, ఆర్-9, శాంతినగర్ ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, నాగార్జునసాగర్ ఆయకట్టులో కాలువల ఆధునికీకరణ, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల, యువత కోసం అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేపడుతున్నట్లు వెల్లడించారు. కోదాడను ఆధునిక మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. హుజూర్‌నగర్ దేశంలోని ప్రముఖ సిమెంట్ తయారీ కేంద్రాల్లో ఒకటిగా ఎదిగిందని, పారిశ్రామిక అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ద్వారా ఇప్పటివరకు 327 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయని, దాదాపు రూ.11 వేల కోట్ల మేర ప్రయోజనం మహిళలకు అందిందన్నారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగుల ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు.

# విద్యార్థుల కోసం ఆధునిక మరుగుదొడ్లు నిర్మించిన ఎన్నారై దంపతులు

సూర్యాపేట, జులై 11 ం

సమాజ సేవ పట్ల తమ నిబద్ధతను చాటుతూ ఎన్నారైలు ఉప్పల కిరణ్ -- షీలా వీరేంద్ర సిన్హా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు రూ.3 లక్షల వ్యయంతో ఆధునిక మరుగుదొడ్లను నిర్మించి అందించారు. పాఠశాలలో విద్యార్థులు మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న వారు ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా తమ సొంత నిధులతో ఈ నిర్మాణాన్ని చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రమణ మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాన్ని గుర్తించి ఉదారంగా సహాయం చేసిన ఉప్పల కిరణ్, షీలా వీరేంద్ర సిన్హాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ టాయిలెట్ల నిర్మాణం వల్ల విద్యార్థులకు పరిశుభ్రమైన వసతులు అందుబాటులోకి వచ్చాయని, ఇది వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల తరఫున దాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కవిత, ప్రతాప్, ఎం. రంగారావు, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, వరలక్ష్మి, జయప్రకాష్, ఎం. శ్రీనివాస్, రత్నాకర్, ఎన్. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ గ్రూప్-3లో రోస్టర్ పాయింట్లను 16కు తగ్గించాలి

## తల్లమల్ల హసేన్




హైదరాబాద్, జులై 11

ఎస్సీ గ్రూప్-3లో ఉన్న 25 కులాలకు న్యాయం జరిగేలా రోస్టర్ పాయింట్లను ప్రస్తుతం ఉన్న 22 నుంచి 16కు సవరించాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ మాల సంఘాల రాష్ట్ర వైస్ చైర్మన్ తల్లమల్ల హసేన్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ చింతల బస్తీలో జాతీయ అంబేద్కర్ సేన అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావు ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలకు తల్లమల్ల హసేన్ సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చిన తర్వాత కూడా గ్రూప్-3లోని 25 కులాలకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్ల ప్రయోజనం పూర్తిస్థాయిలో అందడం లేదని అన్నారు. రోస్టర్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న 22 పాయింట్ల విధానం వల్ల కాలేజీ ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగోన్నతుల్లో గ్రూప్-3కు రావాల్సిన అవకాశాలు గణనీయంగా తగ్గుతున్నాయని పేర్కొన్నారు. దీంతో ఈ గ్రూపులోని విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల రోస్టర్ పాయింట్లను 22 నుంచి 16కు తగ్గించి, గ్రూప్-3కు చట్టబద్ధంగా లభించాల్సిన రిజర్వేషన్ ప్రయోజనాలు పూర్తిగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నారు

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రూ.11,400 కోట్ల ప్రయోజనం

**మంత్రి పొన్నం ప్రభాకర్**



హుజూర్‌నగర్, జూలై 11 తెలంగాణ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో రూ.3.52 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్టాండ్‌కు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 10,173 ఆర్టీసీ బస్సులు ప్రజలకు సేవలందిస్తున్నాయని చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా రోజుకు సుమారు 35 లక్షల మంది మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 326 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు నమోదవగా, మహిళలకు మొత్తం రూ.11,400 కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. మహిళా సంఘాలకు 600 బస్సులు అందజేసి ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమా లను అమలు చేస్తోం దని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడు తూ, రాష్ట్రంలోని ప్రతి పేద కుటుం బానికి సన్నబియ్యం పంపిణీతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించ దం ద్వారా ప్రజల జీవన వ్యయాన్ని తగ్గిస్తున్నామని అన్నా రు. హుజూర్‌నగర్‌లో నూతన బస్టాం డ్ నిర్మాణంతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబా టులోకి వస్తాయని, రవాణా సేవలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, పెరిక కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధిక, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కవితతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగులో అప్రమత్తంగా ఉండాలి

**రైతులకు జిల్లా యంత్రాంగం కీలక సూచనలు**

సూర్యాపేట, జులై 11



ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరించిన నేపథ్యంలో, సూర్యాపేట జిల్లా యంత్రాంగం రైతులకు కీలక సూచనలు జారీ చేసింది. వర్షపాతం, సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే పంటల ప్రణాళిక రూపొందించాలని సూచించింది. జూలై తొలి రోజుల్లో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైనందున, అక్కడక్కడ కురిసే వర్షాలను చూసి తొందరపడి విత్తనాలు చల్లడం లేదా నాట్లు వేయవద్దని అధికారులు హెచ్చరించారు. స్థానికంగా నమోదైన వర్షపాతం, వాతావరణ అంచనాలు, సాగునీటి లభ్యతను పరిశీలించిన తర్వాతే సాగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆందోళనకరం జిల్లాకు సాగునీరు అందించే ప్రధాన ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటి నిల్వలను పరిశీలించిన నీటిపారుదల శాఖ, ఈ ఖరీఫ్‌కు పూర్తి స్థాయిలో సాగునీటి సరఫరాకు హామీ ఇవ్వడం కష్టమని తెలిపింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు (చీూ): మొత్తం సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం 138.21 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గత ఏడాదితో పోలిస్తే నిల్వలు 23.22 శాతం తగ్గాయి. 2.29 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఈ ప్రాజెక్టుపై ఆధారపడే రైతులు పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్--2 (లోయర్ మానేరు): మొత్తం సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.70 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టు కింద ఉన్న 2.13 లక్షల ఎకరాల రైతులు కూడా సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. మూసి ప్రాజెక్టు: మొత్తం 4.460 టీఎంసీల సామర్థ్యంలో ప్రస్తుతం 3.54 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతానికి ఖరీఫ్ అవసరాలకు ఇది సరిపోతుందని అంచనా వేసినప్పటికీ, నీటిని పొదుపుగా వినియోగించాలని అధికారులు సూచించారు. వరి సాగులో జాగ్రత్తలు జిల్లాలో వరి సాగు ప్రధానంగా ఎన్ఎస్‌పి, ఎస్ఆర్ఎస్‌పి, మూసి కాల్వలపై ఆధారపడి ఉండటంతో నీటి లభ్యత అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో రైతులు వరికి బదులుగా పప్పుధాన్యాలు, తక్కువ నీరు అవసరమయ్యే పంటలు లేదా కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ సూచించింది. బోరుబావులు, బావుల ద్వారా నీటి వసతి ఉన్న రైతులు కూడా ఎక్కువ కాలపరిమితి గల వరి రకాలకు బదులుగా ఆర్ఎన్ఆర్, హెచ్ఎమ్‌టీ, జేజీఎల్, జై శ్రీరామ్, డబ్ల్యూజీఎల్--44, కేఎన్ఎమ్--1638, కేఎన్ఎమ్--7715 వంటి స్వల్పకాలిక వరి రకాలను సాగు చేయాలని సూచించింది. వర్షాల ఆధారంగా అత్యవసర పంటల ప్రణాళిక జూలై 15లోపు మంచి వర్షాలు పడితే: స్వల్పకాలిక వరి రకాలు, కందులు, పెసర్లు సాగు చేయవచ్చు. జూలై 16--30 మధ్య వర్షాలు పడితే: దీర్ఘకాలిక వరి రకాలను పూర్తిగా నివారించి కందులు, బొబ్బర్లు, ఉలవలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆగస్టు 15 వరకు వర్షాలు ఆలస్యమైతే: కందులు, బొబ్బర్లు, ఉలవలు, కూరగాయల సాగు చేపట్టాలి. ఆగస్టు 15 తర్వాత వర్షాలు వస్తే: మినుములు, కందులు, బొబ్బర్లు, ఉలవలు, స్వల్పకాలిక కూరగాయల పంటలకే పరిమితం కావాలని సూచించారు. నీటి పొదుపు పద్ధతులు అవలంబించాలి డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ, ఫామ్‌పాండ్లు, సమతుల్య ఎరువుల వినియోగం వంటి నీటి పొదుపు పద్ధతులను రైతులు తప్పనిసరిగా పాటించాలని ఉద్యానవన శాఖ సూచించింది. నీటి వసతి ఉన్న రైతులు శాఖ సిఫార్సుల మేరకు ఆయిల్‌పామ్ సాగును కూడా చేపట్టవచ్చని తెలిపింది. జిల్లా యంత్రాంగం, వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన శాఖలు జారీ చేసే తాజా సూచనలను అనుసరిస్తూ, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటేనే నష్టాలను తగ్గించి స్థిరమైన దిగుబడులు సాధించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# రోస్టర్ పాయింట్ల సవరణతోనే మాలలకు న్యాయం: మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, జులై 11

మాల సామాజిక వర్గానికి న్యాయం జరగాలంటే రోస్టర్ పాయింట్లలో తక్షణమే సవరణలు చేయాలని, అలాగే చేవెళ్ల డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఖైరతాబాద్‌లోని చింతల్ బస్తీలో జాతీయ అంబేద్కర్ సేన అధ్యక్షుడు మన్నె శ్రీధర్ చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించిన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేసి మాలలకు మూడో గ్రూపులో 5 శాతం రిజర్వేషన్ కల్పించినప్పటికీ, ప్రస్తుతం అమల్లో ఉన్న రోస్టర్ విధానంలోని లోపాల కారణంగా ఆ వర్గానికి వాస్తవంగా సుమారు 2.8 శాతం మేరకే అవకాశాలు లభిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే మూడుసార్లు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ ద్వారా సమగ్రంగా పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులతో కూడా ఈ అంశంపై చర్చించినట్లు వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ హక్కులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇస్తూ, మాల సామాజిక వర్గం ఐక్యంగా ఉండి తమ రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.



## విద్యార్థుల సాహిత్య ప్రతిభకు నిదర్శనం 'పాదు' పుస్తకం

హైదరాబాద్, జూలై 11

నకిరేకల్ మండలం తాటికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన సమీక్ష వ్యాసాల సంకలనమైన 'పాదు' పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ (రాజజు=ు) తెలుగు కోఆర్డినేటర్ మహమ్మద్ యాసిన్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ హెన్రీ మార్టిన్ ఇన్స్టిట్యూట్‌లో రాష్ట్ర విషయ నిపుణులు, అష్టావధాని అవుసుల భాను ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సాగర్ల సత్తయ్య సంపాదకత్వంలో వెలువడిన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ యాసిన్ మాట్లాడు తూ, పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు సమీక్ష వ్యాసాలు రచించి పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి ప్రయత్నాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు విషయ నిపుణులు డాక్టర్ మడత భాస్కర్, డాక్టర్ సిద్ధంకి యాదగిరి, శీలం భద్రయ్య, డాక్టర్ కాసర్ల నరేష్ రావు, కటుకోజ్వల మనోహరాచారి, స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, డాక్టర్ కనకటి రామకృష్ణ, పొడిచేటి శంకర్, మద్దోజు సుధీర్ బాబు, కే. కిషన్, ముక్కామల జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా చంటి ప్రభు..

### దళిత సాధికారతకు కృషి చేస్తానని వెల్లడి

సంగారెడ్డి ప్రతినిధి, జూలై 11, :

భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన న్యాయవాది చంటి ప్రభు తన నియామకానికి పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా అంకితభావంతో పనిచేస్తానని, దళితుల సంక్షేమం, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు దళిత మోర్చాను మరింత బలోపేతం చేసి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతి కార్యకర్తను కలుపుకొని సంస్థాగతంగా పార్టీని మరింత బలపరుస్తానని పేర్కొన్నారు. దేశ సమైక్యత, జాతీయత, భారతీయ సంస్కృతి పరిరక్షణకు పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శిస్తూ, రైతులు, నిరుద్యోగులు, దళితులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. దళితులపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ వారి సంక్షేమం కోసం ప్రజాస్వామ్యబద్ధ ఉద్యమాలు చేపడతామని తెలిపారు. దళిత సమాజంలో పార్టీపై అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## జూలై 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

సంగారెడ్డి ప్రతినిధి, జూలై 11,

జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచితంగా ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 4,06,494 మంది పిల్లలకు మందులు అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఇందుకోసం 1,696 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 88 జూనియర్ కళాశాలలు, 1,504 అంగన్‌వాడీ కేంద్రాలు భాగస్వామ్యం కానుండగా, 903 మంది ఆశా కార్యకర్తలు, 1,428 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలందించనున్నట్లు వెల్లడించారు. ఏదైనా కారణాలతో జూలై 13న మాత్ర తీసుకోలేని పిల్లలకు జూలై 20న మాప్-అప్ కార్యక్రమం నిర్వహించి మందు అందజేస్తామని తెలిపారు.

1--2 సంవత్సరాల పిల్లలకు అర మాత్ర, 2--3 సంవత్సరాల వారికి ఒక మాత్రను చూర్ణం చేసి నీటితో, 3--19 సంవత్సరాల వారికి ఒక నమిలే మాత్రను ఇవ్వాలని సూచించారు. నులిపురుగుల నివారణతో రక్తహీనత, పోషకాహార లోపం తగ్గడం, శారీరక, మానసిక ఎదుగుదల, రోగనిరోధక శక్తి, చదువుపై ఏకాగ్రత మెరుగుపడతాయని పేర్కొంటూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హ బాలబాలికకు ఆల్బెండాజోల్ మాత్ర అందేలా సహకరించాలని కోరారు.

# దొడ్డ సోదరుల ఆదర్శ జీవితం కమ్యూనిస్టులకు స్ఫూర్తి

### పల్లా వెంకట్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు

చిలుకూరు, జూలై 11

తమ యావత్ జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేసి ఆదర్శ కమ్యూనిస్టులుగా జీవించిన దొడ్డ నరసయ్య, దొడ్డ నారాయణరావు సోదరులు నేటి తరానికి స్ఫూర్తిప్రదాతలని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా సీపీఐ మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీపీ దొడ్డ నారాయణరావు తొలి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. దొడ్డ సోదరుల త్యాగం, నిబద్ధత వల్ల చిలుకూరు గ్రామానికి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. వయస్సు పైబడిన తరువాత కూడా వారు ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతమవుతోందని, అనేక దేశాల్లో ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీలు పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రజల మద్దతు పెరుగుతోందని, ఇటీవల శ్రీలంకలో కమ్యూనిస్టు భావజాలానికి అనుకూల ప్రభుత్వ ఏర్పాటుతో పాటు అమెరికాలోని ఒక ప్రధాన నగరంలో కమ్యూనిస్టు అభ్యర్థి మేయర్‌గా ఎన్నిక కావడం దీనికి నిదర్శనమన్నారు. దోపిడీ, స్వార్థం లేని సమాజ నిర్మాణం కమ్యూనిస్టు సిద్ధాంతాల ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. కమ్యూ నిస్టు ఉద్యమాన్ని అణచివేయా లని గత శతాబ్ద కాలంగా అనేక ప్రయ త్నాలు జరిగినప్పటికీ అవన్నీ విఫలమ య్యాయని, ప్రజల సమస్య లపై పోరాటం చేసే శక్తిగా కమ్యూని స్టు పార్టీ ముందుకు సాగుతోందన్నా రు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానా లపై విమర్శలు చేస్తూ ప్రజా వ్యతిరేక పాలన ఎక్కువకాలం నిలవ దని వ్యాఖ్యానించారు. దొడ్డ నారాయణ రావు మచ్చలేని ప్రజానాయకుడిగా, రాజకీయాలకు అతీతంగా అందరి గౌరవాన్ని పొందిన నాయకుడిగా సేవలందించారని గుర్తు చేశారు. ప్రజా ఉద్యమాల్లో




ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియా డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఉందని అన్నారు. జిల్లా సీపీఐ కార్యదర్శి స్వాగత ప్రసంగం చేయగా, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, యల్లావుల రావు, కంబాల శ్రీనివాస్, సాహెబ్ అలీ, బద్దం కృష్ణారెడ్డి, నంద్యాల రామిరెడ్డి, దేవరం మల్లేశ్వరి, బత్తినేని హనుమంతరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, బూర వెంకటేశ్వర్లు, చేపూరి కొండలు, దొడ్డ రమేష్‌బాబు, దొడ్డ శ్రీధర్, దొడ్డ ఝాన్సీ, డాక్టర్ అందే సత్యం, డాక్టర్ జాస్తి సుబ్బారావు, రావెళ్ల సీతారామయ్య, సీపీఐ సర్పంచులు మండవ జయమ్మ, గుగులోతు లలిత, కడియాల పద్మ, వాడ కొప్పుల ఉమ, పోతురాజు సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ కాటంరాజు, చిలువేరు ఆంజనేయులు, దొడ్డ కుటుంబ సభ్యులు, పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వియత్నాం పడవ ప్రమాదం: బాధితులకు అండగా ఉంటాం

### సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 11

వియత్నాంలో పర్యటనకు వెళ్లిన భారతీయ పర్యాటకులు ప్రయాణిస్తున్న పడవ ప్రమాదానికి గురై, తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు మృతి చెందినట్లు వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంపై సమాచా రం అందిన వెంటనే ఉన్నతాధికారులను అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం తెలుగు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు కూడా ప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుస్తోందని పేర్కొన్న సీఎం, గాయపడిన వారికి అత్యవసర వైద్య చికిత్స అందేలా చూడాలని అధికారులకు సూచించారు. బాధితులు, వారి కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "శ్రీరాముడు శాశ్వతం.. మీ




అధికారం తాత్కాలికం" -- సీఎం వ్యాఖ్యలపై దాసోజు శ్రవణ్ విమర్శలు హైదరాబాద్, జూలై 11 ఖమ్మంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ ఆరోపించారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి శ్రీరాముడిపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని భక్తులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై చర్చించాల్సిన సభను రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు వేదికగా మార్చారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు, రైతుల ఇబ్బందులను పక్కనబెట్టి రాజకీయ ప్రసంగాలకు ప్రాధాన్యం ఇచ్చా రని ఆరోపించారు. 2028 అసెంబ్లీ ఎన్నికలు, నియోజక వర్గాల పునర్విభజన పై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధమై నవని, ఎన్నికల షెడ్యూల్‌ను ముందు గానే ప్రకటించే అధికా రం ముఖ్య మంత్రికి లేదని శ్రవణ్ ప్రశ్నించారు. నియోజక వర్గాల పున ర్వి భజన అంశంలో కాంగ్రెస్ పార్టీ అధికారిక వైఖరికి విరు ద్ధంగా ముఖ్య మంత్రి వ్యవహ రిస్తున్నారని, బీజేపీ తో రహ స్య అవగాహన ఉన్నట్లు అను మానాలు వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కూడా ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలను ఖండించిన ఆయన, గతంలో 22 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహాన్ని తట్టుకున్న బ్యారేజీ కేవలం 80 వేల క్యూసెక్కుల నీటితో కొట్టుకుపోతుందా అని ప్రశ్నించారు. బ్యారేజీ గేట్లు పూర్తిగా మూయకుండానే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని నిల్వ చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదులుతోందని ఆరోపించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు.

### జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ విద్యార్థులకు కొత్త బస్సులు..

## స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



సంగారెడ్డి ప్రతినిధి, జూలై 11,

చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పా టు చేసిన రెండు నూతన బస్సులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారం భించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు సురక్షితమైన రవాణా సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కొత్త బస్సుల వల్ల విద్యార్థుల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో సమయపాలన మెరుగుపడి, ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తూ ఏర్పాటు చేసిన స్మార్ట్ కంప్యూటర్ ల్యాబ్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్య సించి, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యా లను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రపంచ స్థాయి సాంకేతిక విద్య అందిం చా లనే లక్ష్యంతో విద్యాసంస్థల్లో అవసరమైన అన్ని సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, జిల్లా యంత్రాంగ ప్రతినిధులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో 'స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' శిక్షణ.. క్రీడాకారులకు నైపుణ్యాలపై అవగాహన

సంగారెడ్డి ప్రతినిధి, జూలై 11,

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జూలై 10 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఫజిల్, సీనియర్ కోచ్‌లు ఫణీంద్ర, రాజేశ్, రుషేందర్ కుమార్ క్రీడాకారులకు నైపుణ్య శిక్షణ, వార్మప్ పద్ధతులు, పోటీల్లో పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి కే. ధనంజనేయులు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను రోజువారీ సాధనలో అమలు చేసి, ఇతర క్రీడాకారులకు కూడా చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది పాల్గొనడం విశేషంగా నిలిచింది.



# 'ఎస్ఐఆర్' ప్రక్రియను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి ప్రతినిధి, జూలై 11,

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కోఆర్డినేటర్లు, మండల పార్టీ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లతో నిర్వహించిన ఆడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ ఫారాలు అందుకున్న ప్రజలు పూర్తి వివరాలతో వాటిని భర్తీ చేసి సమర్పించేలా బూత్ లెవల్ అధికారులు సహకరించాలని, ఈ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు ఒకేచోట విధులు నిర్వహించకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తూ ఫారాలను పంపిణీ చేసి తిరిగి స్వీకరించాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా గతంలోనూ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం డిజిటలైజేషన్ ప్రక్రియ కేవలం 12 శాతం మాత్రమే పూర్తైందని, దీనిని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసి అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## టీఆర్‌పీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా పుష్పలీల

హైదరాబాద్, జూలై 11

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా శ్రీమతి ఇరుకుల్ల పుష్పలీల నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నర్సయ్య గౌడ్ శనివారం ఆమె నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని, పుష్పలీలకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. పార్టీ క్రమశిక్షణను బలోపేతం చేయడంతో పాటు మహిళా విభాగాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఆమె కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇరుకుల్ల పుష్పలీల మాట్లాడు తూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, విలువలకు అనుగుణంగా పనిచేస్తూ, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు శ్రమిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి బత్తిని మీనా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షల శిబిరం

సిద్దిపేట, జూలై 11

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ సభ్యులకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించి కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ సిద్దిపేటలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రజలకు కంటి సంరక్షణలో రక్షణ కవచంలా నిలుస్తోందన్నారు. ఆసుపత్రి అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే నిజమైన అభివృద్ధికి సూచిక అని ఆయన పేర్కొన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సేవలను విస్తరించేందుకు గతంలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రైవర్లు, ఆటో కార్మికులు తప్పనిసరిగా నిరంతర వ్యవధిలో కంటి పరీక్షలు చేయించుకోవాలని హరీశ్ రావు సూచించారు.

# భారత నౌకాదళంలో చేరిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి




### సముద్ర రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసిన స్వదేశీ స్టెల్త్ యుద్ధనౌక

విశాఖపట్నం, జూలై 11

భారత సముద్ర రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ మహేంద్రగిరి శనివారం భారత నౌకాదళం తూర్పు నౌకాదళ విభాగంలో అధికారికంగా చేరింది. విశాఖపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రాజెక్ట్-17ఏ కింద నిర్మించిన ఆరవ ఫ్రిగేట్‌ను నౌకాదళానికి అంకితం చేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, ఐఎన్ఎస్ మహేంద్రగిరి భారత రక్షణ తయారీ రంగంలో స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మించిన ఈ 6,670 టన్నుల యుద్ధనౌకలో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలు, సాంకేతికతను వినియోగించినట్లు తెలిపారు. విమాన దాడులు, సముద్ర ఉపరితల యుద్ధం, జలాంతర్గాములపై పోరాటానికి అనువైన ఈ యుద్ధనౌకలో బ్రహ్మోస్ క్షిపణులు, అత్యాధునిక వైమానిక రక్షణ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, బహుళ ప్రయోజన హెలికాప్టర్‌ను మోహరించే సౌకర్యం ఉండటంతో ఇది భారత నౌకాదళంలోని అత్యంత శక్తివంతమైన ముందువరుస యుద్ధనౌకల్లో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. యుద్ధ స్వరూపం వేగంగా మారుతోందని, కృత్రిమ మేధ డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతికతలు ప్రాధాన్యం సంతరించుకున్నప్పటికీ, బలమైన సాంప్రదాయ సైనిక శక్తికి అవి ప్రత్యామ్నాయం కావని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "భవిష్యత్ యుద్ధాలు కృత్రిమ మేధతో సాగవచ్చు. కానీ విజయాన్ని నిర్ణయించేది దేశ సంకల్పం, శిక్షణ పొందిన సైనికులు, విశ్వసనీయ సైనిక శక్తే" అని ఆయన పేర్కొన్నారు. హిందూ మహాసముద్రం--ఇండో పసిఫిక్ ప్రాంతాల్లో భారత సముద్ర, ఆర్థిక ప్రయోజనాలను రక్షించడంలో ఐఎన్ఎస్ మహేంద్రగిరి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భారత నౌకా నిర్మాణ రంగం సాధిస్తున్న పురోగతి, అత్యాధునిక యుద్ధనౌకలను స్వదేశంలోనే నిర్మించే సామర్థ్యానికి ఈ నౌక నిదర్శనమని చెప్పారు. దేశ యువ పారిశ్రామికవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, పెట్టుబడిదారులు భవిష్యత్ యుద్ధ అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను అభివృద్ధి చేసి, రక్షణ రంగంలో భారత్‌ను మరింత స్వావలంబన వైపు నడిపించాలని పిలుపునిచ్చారు. భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ మాట్లాడుతూ, ప్రాజెక్ట్-17ఏ కింద యుద్ధనౌకల నిర్మాణంలో ఇది మరో కీలక మైలురాయిగా అభివర్ణించారు. వేగవంతమైన నిర్మాణం, నిర్ణీత గడువులో డెలివరీ, స్వదేశీ తయారీ సామర్థ్యానికి ఇది నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళ కమాండర్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, ఎండీఎల్ సీఎండీ కెప్టెన్ జగ్‌మోహన్ (రిటైర్డ్), సీనియర్ నౌకాదళ అధికారులు, మాజీ సైనికాధికారులు, నౌకా నిర్మాణ పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మైనారిటీలను విస్మరించాయి

### షాఫరుద్దీన్ హమీద్

జల్పల్లి, జూలై 11

ఇన్ని సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినా మైనారిటీ నాయకులను, వారి సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ వైఖరి కూడా ఇలాగే ఉందని జల్పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ షాఫరుద్దీన్ హమీద్ మండిపడ్డారు. జల్పల్లి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో మైనారిటీ నాయకులతో నిర్వహించిన ప్రిపరేటరీ సమావేశంలో 47 మంది మైనారిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాఫరుద్దీన్ హమీద్ మాట్లాడుతూ.. 'ఎవరెంతో వారికంత' అనే నినాదంతో ఎమ్మెల్ తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) మైనారిటీల్లో కొత్త ఆశలు రేకెత్తించిందన్నారు. ఇకపై తాము ఏ ఇతర పార్టీ జెండాను మోసేది లేదని, మైనారిటీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే టీఆర్‌పీని బలపరుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రటరీ దేవళ్ల సమ్మయ్య, బీసీ ఎంప్లాయిస్ ఫెడరెషన్ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ కొట్టే, టీఆర్‌పీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పటేల్ వనజ, సహాయ కార్యదర్శి గిరిగాని బిక్షపతి గౌడ్, మైనారిటీ నాయకులు ఇక్బాల్ భాయ్, రఫీక్ భాయ్, ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.



## న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన వట్టె జానయ్య యాదవ్‌కు టీఆర్పీ నాయకుల సన్మానం

హైదరాబాద్, జూలై 11

తెలంగాణ రాష్ట్ర రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ వట్టె జానయ్య యాదవ్ గారు ఇటీవల న్యాయవాదిగా ఎన్‌రోల్ కావడంతో, సూర్యాపేట జిల్లా నుండి వచ్చిన పార్టీ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్ పెన్‌పహాడ్ మండలం నుండి సూర్యాపేట జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు మామిడి శోభన్, పెన్‌పహాడ్ మండలానికి చెందిన వర్మ మరియు ఆయన సతీమణి కలిసి వట్టె జానయ్య యాదవ్ గారికి హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారి సమక్షంలో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదిగా కొత్త బాధ్యతలు చేపట్టిన వట్టె జానయ్య యాదవ్ గారు ప్రజలకు మరింత మెరుగైన న్యాయసేవలు అందిస్తూ, సామాజిక న్యాయం సాధనలో ముందుండాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్ కూడా పాల్గొని, వట్టె జానయ్య యాదవ్ గారికి అభినందనలు తెలియజేశారు.




## అగ్రవర్ణాల పాలనకు చరమగీతం పాడాలి

### టీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడు తుప్పతి బిక్షపతి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అగ్రవర్ణాల ఆధిపత్య పాలనే కొనసాగుతోందని, ఇకనైనా ఆ పరిస్థితికి ముగింపు పలికి బీసీలు రాజ్యాధి కారం సాధించే దిశగా ఐక్యంగా ఉద్యమిం చాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) జిల్లా అధ్యక్షుడు తుప్పతి బిక్షప తి పిలుపునిచ్చారు. శనివారం గజ్వే ల్‌లో నిర్వహించిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ, తీన్మా ర్ మల్లన్న ఆధ్వర్యంలో జూలై 5న భువన గిరిలో నిర్వహించిన మహాసభ అశేష జనవాహిని మధ్య విజయవంతం కావడం బీసీలలో వచ్చిన రాజకీయ చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. తమ పార్టీ కేవలం అధికారమే ధ్యేయంగా కాకుండా, కార్యకర్తల సంక్షేమా నికి కూడా కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు ప్రమాద బీమా సౌకర్యం కల్పి స్తున్నట్లు ఆయన వెల్లడించారు. కులాలకు అతీతం గా బీసీ రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్క రూ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి అండ గా నిలవాలని ఆయన కోరారు. ఈ సమా వేశంలో పార్టీ జిల్లా, మండల, యువ జన, రైతు విభాగాల ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మైనారిటీలను విస్మరించాయి: షాఫరుద్దీన్ హమీద్

జల్పల్లి, జూలై 11

ఇన్ని సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినా మైనారిటీ నాయకులను, వారి సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ వైఖరి కూడా ఇలాగే ఉందని జల్పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ షాఫరుద్దీన్ హమీద్ మండిపడ్డారు. జల్పల్లి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌లో సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో మైనారిటీ నాయకులతో నిర్వహించిన ప్రిపరేటరీ సమావేశంలో 47 మంది మైనారిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాఫరుద్దీన్ హమీద్ మాట్లాడుతూ.. 'ఎవరెంతో వారికంత' అనే నినాదంతో ఎమ్మెల్ తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) మైనారిటీల్లో కొత్త ఆశలు రేకెత్తించిందన్నారు. ఇకపై తాము ఏ ఇతర పార్టీ జెండాను మోసేది లేదని, మైనారిటీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే టీఆర్‌పీని బలపరుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రటరీ దేవళ్ల సమ్మయ్య, బీసీ ఎంప్లా యిస్ ఫెడరెషన్ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ కొట్టే, టీఆర్‌పీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పటేల్ వనజ, సహాయ కార్యదర్శి గిరిగాని బిక్షపతి గౌడ్, మైనారిటీ నాయకులు ఇక్బాల్ భాయ్, రఫీక్ భాయ్, ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారి పనులు వేగవంతం

హైదరాబాద్, జూలై 1 1



తెలంగాణలో జాతీయ రహదారి మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర రూపురేఖలను మార్చే పలువురు కీలక జాతీయ రహదారి కారిడార్ల నిర్మాణం పూర్తయిందని, మరికొన్ని పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఇండోర్--హైదరాబాద్ జాతీయ రహదారి కారిడార్‌లో తెలంగాణ పరిధిలోని 136 కిలోమీటర్ల నిర్మాణం రూ.4,485 కోట్ల వ్యయంతో పూర్తయిందని మంత్రి తెలిపారు. అలాగే హైదరాబాద్--విశాఖపట్నం కారిడార్‌లో 164 కిలోమీటర్ల నిర్మాణాన్ని రూ.6,072 కోట్లతో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మార్గాలు రాష్ట్రంలో రాకపోకలను మరింత సులభతరం చేస్తున్నాయని అన్నారు. నాగ్‌పూర్--విజయవాడ జాతీయ రహదారి కారిడార్‌లో మొత్తం 401 కిలోమీటర్లలో ఇప్పటివరకు 94.6 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. రూ.13,406 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. సూరత్--సోలాపూర్--చెన్నై జాతీయ రహదారి కారిడార్‌లో తెలంగాణ పరిధిలోని 78 కిలోమీటర్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని మంత్రి పేర్కొన్నారు. రూ.2,360 కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు త్వరలో పూర్తై ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. హైదరాబాద్--పనాజీ కారిడార్‌లో మొత్తం 175 కిలోమీటర్లలో 85 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ జాతీయ రహదారి కారిడార్లు పూర్తయితే తెలంగాణలో పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ, పర్యాటక రంగాలకు కొత్త ఊపు వస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలతో మరింత వేగవంతమైన రహదారి అనుసంధానంతో కలిపే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ పెట్టుబడులతో మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.




# ఓటమి పరిపూర్ణం

## ఇంగ్లాండ్ చేతిలో టీమ్ఇండియా క్లీన్‌స్వీప్.. ఐదో టీ20లోనూ భారత్‌కు పరాభవం!

### 4-0తో సిరీస్ కైవసం చేసుకున్న ఆతిథ్య జట్టు.. బట్లర్ రికార్డు సెంచరీ, బ్రూక్ విధ్వంసం

లండన్, జులై 11 :ఇంగ్లాండ్ పర్యటనలో భారత క్రికెట్ జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఇంగ్లాండ్ 4-0తో చేజిక్కించుకుని టీమ్‌ఇండియాను క్లీన్‌స్వీప్ చేసింది. చివరిదైన ఐదో టీ20 మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 56 పరుగుల భారీ తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 257 పరుగుల హిమాలయ స్కోరును బోర్డుపై ఉంచింది. అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో భారత్‌పై నమోదైన అత్యధిక స్కోరు ఇదే కావడం గమనార్హం. ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ కేవలం 64 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 131 పరుగులతో చెలరేగి 'శత'క్కొట్టగా, హ్యారీ బ్రూక్ (45 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్సర్లతో 95 నాటౌట్) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. వీరిద్దరూ భారత బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ రెండో వికెట్‌కు ఏకంగా 102 బంతుల్లో 233 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఇంగ్లాండ్‌కు భారీ స్కోరు అందించారు.

అనంతరం 258 పరుగుల కండీరాల లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులకే పరిమితమై ఘోర ఓటమిని చవిచూసింది. భారత బ్యాటర్లలో ఓపెనర్ ఇషాన్ కిషన్ (56), యువ సంచలనం తిలక్ వర్మ (53) అర్ధసెంచరీలతో రాణించి గట్టి పోరాటమే చేసినప్పటికీ, మిగిలిన టాప్, మిడిలార్డర్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేయడంతో భారత్‌కు పరాజయం తప్పలేదు. లండన్ పిచ్‌పై ఇంగ్లండ్ బౌలర్ల వ్యూహాత్మక దాడుల ముందు భారత లోయర్ ఆర్డర్ క్రీజులో ఎక్కువసేపు నిలదొక్కుకోలేకపోయింది. ఈ ఆఖరి పోరులోనూ ఓడిపోవడంతో ఇంగ్లాండ్ పర్యటనలో భారత జట్టు వైఫల్యం మరోసారి స్పష్టమవగా, వరుస సిరీస్ పరాజయాలపై క్రీడా విశ్లేషకులు మరియు అభిమానుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# లార్డ్స్ టెస్టులో టీమ్ ఇండియా హవా

**ఇంగ్లాండ్‌పై 250ం పరుగుల ఆధిక్యం!**

**భారత బౌలర్ల ధాటికి 170 పరుగులకే ఇంగ్లాండ్ ఆలౌట్**

**5 వికెట్లతో చెలరేగిన క్రాంతి గౌడ్**

లార్డ్స్, జులై 11: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 115 పరుగుల ఘనమైన ఆధిక్యాన్ని సంపాదించి మ్యాచ్‌పై పట్టు బిగించింది. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులకు ఆలౌట్ కాగా, అనంతరం తన మొదటి ఇన్నింగ్స్‌లో 21/1 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ జట్టు.. భారత బౌలర్ల దెబ్బకు కేవలం 170 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో అమీ జోన్స్ (52) అర్ధసెంచరీతో ఒంటరి పోరాటం చేయగా, నాట్ సీవర్ బ్రంట్ (44), ఓపెనర్ మైయా బౌచియర్ (23) పరుగులతో రాణించారు. భారత బౌలింగ్ విభాగంలో క్రాంతి గౌడ్ కేవలం 37పరుగులిచ్చి 5 వికెట్లు (5/37) పడగొట్టి ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను తీవ్రంగా దెబ్బతీయగా, సయాలి సత్ఘరే, స్నేహ్ రాణా రెండేసి వికెట్లతో, దీప్తి శర్మ ఒక వికెట్‌తో సత్తా చాటారు. రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత బ్యాటర్లు అదరగొట్టారు. స్మృతి మంధాన హాఫ్ సెంచరీ చేయగా.. షెఫాలీ వర్మ (33), యాస్తికా బాటియా రాణించడంతో భారత్ ఆధిక్యం 250 పరుగులు దాటింది.




# హరీశ్‌ను విమర్శించే అర్హత రేవంత్‌కు లేదు

**కేసీఆర్ తయారుచేసిన సైనికుడు హరీశ్ రావు**

**నీటి సంక్షోభం కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే**

**కక్ష సాధింపుతో రైతులను ఆగం చేస్తున్న సీఎం**

**కన్నెపల్లి నుంచే రోజూ 2 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు**

**రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం లేఖతోనైనా సోయి తెచ్చుకోవాలి**

**ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**




హైదరాబాద్, జూలై 11: రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభంపై కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువేనని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రం ఏపీ ప్రభుత్వం పట్టిసీమ పంపులు ఆన్ చేసి గోదావరి జలాలను ఎత్తిపోస్తుంటే అదే గోదావరిలో మనకు నీళ్లు లేవంటూ రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కేవలం రాజకీయ కక్షతో, కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే దురుద్దేశంతోనే పంపులు ఆన్ చేయకుండా రైతులను ఆగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మేడిగడ్డ బ్యారేజీతో సంబంధం లేకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల మేర నీటి ప్రవాహం ఉందని, 94 మీటర్ల లభ్యత ఉంటేనే మోటర్లు ఆన్ చేయవచ్చని నిపుణులు స్పష్టం చేశారన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ మరో వంద రోజుల పాటు ప్రవాహం ఉంటుందని, రోజుకు 2 టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోస్తే 200 టీఎంసీలతో గోదావరి బేసిన్‌లోని అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు రిజర్వాయర్లు నిండి తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని వివరించారు. కళ్లముందే లక్షల క్యూసెక్కుల వరద కిందకు పోతుంటే, నీళ్లు లేవని అబద్ధాలు చెబుతూ అచ్చోసిన ఆంబోతులా రంకెలేస్తూ రేవంత్ రెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు.

మాజీ మంత్రి హరీశ్ రావుపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం కంటే ముందు నుంచే కేసీఆర్‌కు రక్షణ కవచంగా నిలిచిన సైనికుడు హరీశ్ రావు అని కొనియాడారు. నాలుగు పార్టీలు మారిన రేవంత్ రెడ్డికి హరీశ్ రావు క్యారెక్టర్ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోతే పొద్దున కాంగ్రెస్ వాళ్లతో, రాత్రికి బీజేపీ వాళ్లతో ఉంటారు. అసలు శీల పరీక్ష చేయాల్సింది రేవంత్ రెడ్డికే అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 2022 వరదల ఫోటోలు చూపించి కన్నెపల్లి మునిగిపోయిందంటూ సీఎం అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని, పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని మేడిగడ్డ వల్లే మునుగుతోందని మాట్లాడటం ఆయన అవగాహనారాహిత్యానికి, బుర్రతక్కువతనానికి నిదర్శనమన్నారు. రేవంత్ రెడ్డి పాలన ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి 117 అసెంబ్లీ స్థానాలు కాదు కదా కనీసం 7 స్థానాలు కూడా రావని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# భారత్-న్యూజిలాండ్ బంధంలో నవశకం

**రానున్న 15 ఏళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు**

**ప్రధాని మోదీ కీలక ప్రకటన!**

ఆక్లాండ్, జులై 11: భారతదేశం కేవలం ప్రపంచ ఉత్పత్తులకు మార్కెట్‌గా మాత్రమే లేదని, అంతర్జాతీయ పెట్టుబడులకు అత్యంత అనువైన గమ్యస్థానంగా, ప్రపంచ వృద్ధికి ఒక ప్రయోగవేదికగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అక్లాండ్‌లో జరిగిన భారత్-న్యూజిలాండ్ వ్యాపార, క్రీడాభాగస్వామ్య కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇరుదేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల సాంకేతికత, పెట్టుబడులు, సేవల రంగాల్లో అపార అవకాశాలు లభిస్తాయని, 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న 15 ఏళ్లలో భారత్‌లో 20 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టేందుకు న్యూజిలాండ్ ముందుకు రావడం కేవలం పెట్టుబడి మాత్రమే కాదని, భారత్ వృద్ధి ప్రయాణంలో భాగం కావాలనే ఆ దేశ నిబద్ధతకు నిదర్శనమన్నారు. భారత్‌లోని 100 నగరాల్లో స్మార్ట్ సిటీస్ మిషన్ కింద 8 వేలకు పైగా ప్రాజెక్టులు నడుస్తున్నాయని, పట్టణ రవాణా, నీరు, వ్యర్థాల నిర్వహణ రంగాల్లో న్యూజిలాండ్ కంపెనీలు భాగస్వాములు కావాలని, అలాగే ఆ దేశ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. న్యూజిలాండ్‌లోని ప్రవాస భారతీయులను ఇరుదేశాల స్వర్ణయుగ శకానికి నావికులుగా అభివర్ణిస్తూ.. 'కలిసి చేసే ప్రయాణం' అనే అర్థం వచ్చే మావోరీ పదం 'వాకా'ను ప్రస్తావించి, భారత్-న్యూజిలాండ్ 'వాకా' సరికొత్త ప్రయాణానికి సిద్ధంగా ఉందని మోదీ ప్రకటించారు. ఇరుదేశాల మధ్య మానవ వనరులు, క్రీడా సంబంధాల ప్రాధాన్యతను వివరిస్తూ.. ఎయిర్ న్యూజిలాండ్ సంస్థకు నిఖిల్ రవిశంకర్ సీఈవో కాగలరని, ఆనంద్ సత్యానంద్ గవర్నర్ జనరల్ పదవిని చేపట్టగలరని ప్రధాని ఆకాంక్షించారు. అలాగే క్రికెట్ రంగంలో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి ప్రతిభావంతులు అవకాశాలు అందుకోగలరని కొనియాడారు. రగ్బీ క్రీడలో న్యూజిలాండ్ నుంచి భారత్ ఎంతో నేర్చుకోవాలని అనుకుంటోందని, అందుకోసం భువనేశ్వర్‌లో 'న్యూజిలాండ్ రగ్బీ', 'రగ్బీ ఇండియా' భాగస్వామ్యంతో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని కూడా నిర్వహించామని తెలిపారు. కాగా, భారత్-న్యూజిలాండ్ మధ్య 100 ఏళ్లుగా ఉన్న క్రీడా సంబంధాలకు గుర్తుగా ఇరుదేశాల మధ్య స్నేహపూర్వక ఫుట్‌బాల్ సిరీస్ జరగనుందని ప్రధాని వెల్లడించారు.

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

**దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన 7 రైళ్లలో 3 తెలంగాణకు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**

హైదరాబాద్, జూలై 11: రాబోయే రోజుల్లో హైదరాబాద్ నగరం దేశంలోనే అతిపెద్ద బుల్లెట్ ట్రైన్ హబ్ గా అవతరించబోతోందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఏడు బుల్లెట్ రైళ్లలో ఏకంగా మూడు రైళ్లు తెలంగాణకే దక్కాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతోనే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన వికసిత్ భారత్-2047 సాంకేతికత పాత్ర అనే సదస్సులో అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైల్వే అభివృద్ధి, బుల్లెట్ రైళ్ల మార్గాలపై ఆయన కీలక వివరాలు వెల్లడించారు. గత బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా దేశవ్యాప్తంగా ఏడు బుల్లెట్ రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, వీటిలో మూడు హైదరాబాద్ కేంద్రంగా నడుస్తాయని మంత్రి తెలిపారు. ఈ మూడు బుల్లెట్ రైళ్లు హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు నగరాల మధ్య నడుస్తాయని వివరించారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం భారీగా తగ్గుతుందని చెప్పారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం గంటా పది నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అలాగే హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు, చెన్నైకి 2 గంటల్లో చేరుకునే వెసులుబాటు కలుగుతుంది. ఈ రైళ్ల రాకతో నగరవాసుల ప్రయాణ కష్టాలు పూర్తిగా తొలగిపోతాయి అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో సాంకేతికతను వినియోగిస్తూ, అత్యాధునిక సదుపాయాలతో రైల్వే విప్లవం నడుస్తోందని, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు దేశ ప్రయాణ ముఖచిత్రంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టబోతోందన్నారు. రైల్వేలో సమూల మార్పులు, సంస్కరణల క్రెడిట్ అంతా ప్రధాని మోదీకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు.

**తెలంగాణకే రూ.5 వేల కోట్లు**

తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. గత యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్‌లో కేవలం రూ.880 కోట్లు మాత్రమే కేటాయిస్తే నేడు మోదీ సర్కార్ ఒక్క తెలంగాణకే రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తోంది అని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని, ఇప్పటికే 260 స్టేషన్ల పనులు పూర్తయ్యాయని వివరించారు.




# ఓటీటీలో 'పెద్ది'కి కొత్త స్పందన


హైదరాబాద్, జులై 11

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, జాన్వీ కపూర్ కథానాయికగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పెద్ది' చిత్రం థియేటర్లలో ఘనవిజయం సాధించిన తర్వాత ఇప్పుడు ఓటీటీ వేదికపై కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ప్రముఖ డిజిటల్ వేదికలో ప్రసారమవుతున్న ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాల్లో చేసిన మార్పులు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. థియేటర్లలో విడుదలైన సమయంలో జాన్వీ కపూర్ పాత్రపై ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ముఖ్యంగా ఆమెకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు కథకు పెద్దగా ఉపయోగపడలేదని, నిడివిని పెంచేలా ఉన్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఆమె పాత్రపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరిగింది. ఓటీటీలో విడుదలైన రూపంలో మాత్రం చిత్రబృందం కొన్ని మార్పులు చేసినట్లు తెలుస్తోంది. జాన్వీ కపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలను తొలగించ డం, మరికొన్ని సన్నివేశాల నిడివిని తగ్గించడం వల్ల కథ మరింత వేగంగా ముందుకు సాగుతోందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మార్పులతో సినిమా ప్రవాహం మెరుగైందని, ప్రధాన కథపై ఆసక్తి మరింత పెరిగిందని సినీ అభిమానులు పేర్కొంటున్నారు. థియేట ర్లలో ఎక్కువ విమర్శలు ఎదుర్కొన్న జాన్వీ పాత్ర, ఓటీటీలో మాత్రం అంతగా చర్చకు రాకపోవడం విశేషంగా మారింది. కథకు అవసరమైన మేరకే పాత్రను చూపించ డం వల్ల ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన లభిస్తున్న ట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ప్రస్తుతం ప్రేక్షకుల దృష్టి ఎక్కువగా రామ్ చరణ్ నటన, భావోద్వేగ , దర్శకుడు బుచ్చిబాబు సానా కథనంపై కేంద్రీకృతమవు తోంది. సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ అందించిన స్వరాలు కూడా చిత్రానికి మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.

# రామ్‌తో ప్రేమ వార్తలకు భాగ్యశ్రీ బోర్సే ఫుల్ క్లారిటీ

హైదరాబాద్, జులై 11 '

మిస్టర్ బచ్చన్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన బాలీవుడ్ నటి భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో బిజీగా ఉంది. తొలి చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, తన అందం, నటనతో దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించిన ఆమె, తాజాగా 'లెనిన్' చిత్రంతో విజయాన్ని అందుకున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ప్రస్తుతం



ఆమె సినిమా కంటే వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వ్యాఖ్యలతోనే సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. కొంతకాలంగా హీరో రామ్ పోతినేనితో భాగ్యశ్రీ ప్రేమలో ఉన్నారనే ప్రచారం సినీ వర్గాల్లో కొనసాగుతోంది. ఇద్దరూ కలిసి నటిస్తున్న 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రం ప్రారంభమైనప్పటి నుంచే ఈ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ ప్రచారాన్ని రామ్ ఖండించినప్పటికీ, భాగ్యశ్రీ మాత్రం నేరుగా స్పందించలేదు. ఇటీవల 'లెనిన్' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా "హైదరాబాద్ నా రెండో ఇల్లు" అని ఆమె చెప్పడంతో మరోసారి ఈ ప్రచారం ఊపందుకుంది.

## ఇంటర్వ్యూలో ఆసక్తికర సమాధానం

తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భాగ్యశ్రీకి, తాను కలిసి నటించిన హీరోల్లో ఎవరితో స్నేహం చేస్తారు, ఎవరితో ప్రేమలో ఉంటారు, ఎవరిని వివాహం చేసుకుంటారు అనే ప్రశ్న ఎదురైంది. దీనికి సమాధానంగా అఖిల్ అక్కినేని తనకు మంచి స్నేహితుడని చెప్పిన ఆమె, ప్రేమ, వివాహం విషయానికి వచ్చేస రికి చిరునవ్వుతో స్పందించింది. "నేను కలిసి నటించిన హీరోల్లో ఇప్ప టికీ పెళ్లి కాని వ్యక్తి ఒక్కరే ఉన్నారు" అని వ్యాఖ్యానించింది.



# అఖిల్‌కు తొలి విజయానందం

హైదరాబాద్, జులై 11


అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి ఆదరణను సొంతం చేసుకుంటోంది. కెరీర్ ప్రారంభం నుంచి పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయిన అఖిల్‌కు ఈ చిత్రం కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పడిన ఈ సినిమా, విడుదల అనంతరం ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందనను అందుకుంటోంది.

గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ యాక్షన్ కథా చిత్రంలో కథ సుపరిచితంగా ఉన్నప్పటికీ, దర్శకుడు దానిని ఆసక్తికర మలుపులతో నడిపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని సినీ అభిమానులు చెబుతున్నారు. ముఖ్యంగా విరామానికి ముందు వచ్చే కీలక మలుపు, ద్వితీయార్థం, చివరి ఘట్టాలు చిత్రానికి ప్రధాన బలంగా నిలిచాయని అభిప్రా యా లు వ్యక్తమవుతున్నాయి. సినిమాపై వస్తున్న ప్రశంసల్లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు అఖిల్‌దే కావడం విశేషం. ముఖ్యంగా పోరాట సన్నివేశాలు, చివరి భాగంలో ఆయన కనబరిచిన భావోద్వేగ నటనకు ప్రేక్షకులు, అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటి వరకు అఖిల్ నటనపై వచ్చిన విమర్శలకు ఈ చిత్రం సమాధానం చెప్పిందని సామాజిక మాధ్య మాల్లో అభిమానులు పోస్టులు పెడుతు న్నారు. చిత్రానికి వస్తున్న ఆదరణతో చిత్ర బృందం అన్నపూర్ణ స్టూడియోలో విజయో త్సవ వేడుకలు నిర్వహించింది. ఈ వేడుకలో భావోద్వేగ క్షణాలు చోటుచేసుకు న్నాయి. తన సినీ జీవితంలో నటుడిగా తొలిసారి ఇంతటి ప్రశంసలు అందుకోవ డంతో పాటు సినిమా విజయవంతం కావడం చూసి హీరో నాగార్జున భావోద్వే గానికి లోనయ్యారు. ఈ సందర్భంగా అఖిల్ తన తండ్రి నాగార్జున పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం, అనంతరం ఇద్దరూ ఒకరినొకరు హత్తుకోవడం అక్కడున్న వారిని కదిలించింది.

# 'ఓ సుకుమారి' ట్రైలర్‌కు మంచి స్పందన

హైదరాబాద్, జులై 11

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన నటుడు తిరువీర్, ప్రతిభావంతురాలైన నటి ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో రూపొందిన ఈ ప్రేమ, కుటుంబ కథా చిత్రం ట్రైలర్ తాజాగా విడుదలై ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుం టోంది.




విడుదలైన ట్రైలర్‌ను బట్టి చూస్తే, అంద మైన గ్రామీ ణ నేపథ్యంలో సాగే ఓ స్వచ్ఛమైన ప్రేమకథతో పాటు, ఆ తర్వాత ఆ జంట జీవితాల్లో చోటుచేసుకునే పరిణామాల చుట్టూ కథ నడుస్తుందని తెలుస్తోంది. భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు, ప్రేమ, వినోదం సమపాళ్లలో మిళితమైన కథగా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ట్రైలర్ సూచిస్తోంది. తిరువీర్ తన సహజ నటనతో మరోసారి ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించారు. ఇద్దరి మధ్య సన్నివేశాలు చిత్రంపై ఆసక్తిని పెంచుతున్నాయి. గ్రామీణ వాతావరణాన్ని సహజంగా ఆవిష్కరించిన చిత్రీకరణ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



# షూటింగ్‌లో గాయపడిన రాశీ ఖన్నా

ముంబై, జులై 11

ప్రముఖ సినీ నటి రాశీ ఖన్నా చిత్రీకరణ సందర్భంగా గాయపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు అక్షయ్ కుమార్, నటి విద్యా బాలన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అనీస్ బజ్మీ రూపొందిస్తున్న వినోదాత్మక చిత్రంలో రాశీ ఖన్నా కీలక పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రంలోని సాహస విన్యాసాల చిత్రీకరణ జరుగుతున్న సమయంలో ఆమెకు గాయమైనప్పటికీ, ధైర్యం కోల్పోకుండా తనకు కేటాయించిన చిత్రీకరణను పూర్తిచేయడం విశేషంగా నిలిచింది. ఈ విషయాన్ని రాశీ ఖన్నా స్వయంగా సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకుంది. సాహస విన్యాసాల చిత్రీకరణలో గాయపడిన కారణంగా శారీరకంగా ఇబ్బందులు ఎదురైనా, చిత్రీకరణను మధ్యలో నిలిపివేయకుండా పూర్తి చేసినట్లు ఆమె తెలిపింది. తన సినీ జీవితంలో ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో ఇదే అత్యంత కఠినమైన చిత్రీకరణ షెడ్యూల్ అని పేర్కొంది. గాయం కారణంగా నొప్పి ఉన్నప్పటికీ తన బాధ్యతను పూర్తి చేయాలనే ఉద్దేశంతో చివరి వరకు చిత్రీకరణలో పాల్గొన్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా చిత్రబృందానికి, కుటుంబ సభ్యులకు రాశీ ఖన్నా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపింది. ముఖ్యంగా అక్షయ్ కుమార్, విద్యా బాలన్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులంతా తనకు అండగా నిలిచారని పేర్కొంది. వారి సహకారం, ప్రోత్సాహం వల్లే చిత్రీకరణను విజయవంతంగా పూర్తి చేయగలిగానని చెప్పింది. ఈ చిత్రంలో సుదేశ్ లెహ్రి, విజయ్ రాజ్ తదితరులు కూడా కీలక పాత్రలు పోషిస్తున్నారు. వినోద ప్రధానంగా రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.

# 'తమిళ్ మురుగన్'గా ధనుష్

చెన్నై, జులై 11

కోలీవుడ్‌లో విజయవంతమైన కలయికగా గుర్తింపు పొందిన హీరో ధనుష్, దర్శకుడు వెట్రిమారన్ మరోసారి చేతులు కలిపారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందనున్న ఐదో చిత్రానికి 'తమిళ్ మురుగన్' అనే పేరును ఖరారు చేస్తూ చిత్రబృందం ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది. 'పొల్లాదవన్', 'ఆడుకాలం', 'వడ చెన్నై', 'అసురన్' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత దాదాపు ఏడేళ్ల విరామం అనంతరం ఈ జోడీ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

విడుదల చేసిన ప్రచార చిత్రంలో ధనుష్ యుద్ధరంగంలో సైన్యానికి నాయకత్వం వహిస్తున్న వీరయోధుడి పాత్రలో కనిపిం చారు.



# శ్రీలీలకు భారీ ఆదాయం

హైదరాబాద్, జులై 11

టాలీవుడ్‌లో తన నటన, నృత్యంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక శ్రీలీల, సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా కూడా భారీ ఆదాయం ఆర్జిస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రముఖ బ్రాండ్ల ప్రచార కార్యక్రమాలకు ఆమెకు ఉన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రముఖ చిత్రాల భాగస్వామ్య వేదికలో శ్రీలీలకు కోటిన్నర మందికి పైగా అనుచరులు ఉండటంతో, అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తమ ఉత్పత్తుల ప్రచారం కోసం ఆమెను ఎంపిక చేస్తున్నాయని తెలుస్తోంది. ఒక ప్రచార పోస్టు లేదా ప్రచార దృశ్యం కోసం ఆమె రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఈ మొత్తాలపై అధికారిక ధ్రువీకరణ లేదు. సినిమాల విషయానికి వస్తే, తెలుగు చిత్రాలతో పాటు హిందీ చిత్రసీమలోనూ శ్రీలీల అవకాశాలు అందుకుంటోంది. ప్రముఖ హిందీ నటుడు కార్తీక్ ఆర్యన్ సరసన ఓ భారీ చిత్రంలో కథానాయికగా నటిస్తూ బిజీగా ఉంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467